


కృష్ణమ్మ పరవళ్లతో పారవశ్యం
ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణానదికి వరద నీరు పోటెత్తుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో చూసేందుకు పర్యాటకులు పోటెత్తారు. - 8లో..



నమ్మినోళ్లకు నైరాశ్యమే..
ఎన్నికల వేళ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక తొలిసారి నేడు దర్శి నియోజకవర్గానికి రానున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37 /28

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

5న పాలిటెక్నిక్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు
ఒంగోలు సిటీ: ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ పాలిటెక్నిక్ కాలేజీలో ఆటోమొబైల్, సివిల్, మెకానికల్ బ్రాంచిల్లో సీట్లు ఉన్నాయన్నారు. స్పాట్ అడ్మిషన్‌కు హాజరయ్యేందుకు దరఖాస్తులు కళాశాలలో ఇస్తున్నట్లు తెలిపారు. 4వ తేదీలోపు విద్యార్థులు తమ దరఖాస్తు ఈ కళాశాలలో అందజేయాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు విద్యార్థి పదో తరగతి మార్క్స్ మెమో, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్, క్యాస్ట్ సర్టిఫికెట్, టీసీ, పాలిసెట్-2025 రాసిన విద్యార్థులు తమ ర్యాంక్ కార్డు, హాల్ టికెట్‌ల నకళ్లు జతచేయాలన్నారు. 5వ తేదీ జరిగే కౌన్సిలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలన్నారు.

కొండపి పంచాయతీకి ముగిసిన నామినేషన్లు



సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న అద్దగబొట్టు విమలమ్మ

కొండపి: 14 సంవత్సరాల తర్వాత కొండపి పంచాయతీకి సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడంతో నామినేషన్‌లు వేయడానికి అభ్యర్థులు పోటీపడ్డారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ ప్రక్రియ ముగిసిందని, సర్పంచ్ స్థానానికి 15 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి రవిబాబు తెలిపారు. 14 వార్డులకు 39 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారన్నారు. 1వ వార్డుకు నలుగురు అభ్యర్థులు, 2వ వార్డుకు ముగ్గురు, 4వ వార్డుకు ఇద్దరు, 5వ వార్డుకు ఇద్దరు, 6వ వార్డుకు ముగ్గురు, 7వ వార్డుకు నలుగురు, 8వ వార్డుకు ముగ్గురు, 9వ వార్డుకు ఇద్దరు, పదో వార్డుకు ముగ్గురు, 11 వ వార్డుకు ముగ్గురు, 12వ వార్డుకు ఇద్దరు, 13వ వార్డుకు ఇద్దరు, 14వ వార్డుకు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. స్క్రూట్నీ శనివారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభిస్తామని తెలిపారు.

టీడీపీ నాయకుడితో కలిసి పింఛన్లు పంపిణీ



టీడీపీ నేత వద్ద ఉన్న క్యాష్ బ్యాగ్, పక్కన బయోమెట్రిక్ వేస్తున్న సచివాలయ ఉద్యోగి

మార్కాపురం: పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రహసనంలా మారింది. సచివాలయ ఉద్యోగులు కూడా కూటమి నేతలు లేనిది ముందుకు వెళ్లడం లేదు. వారి మెప్పు కోసం చేస్తున్న పనులు విమర్శలకు తావిస్తున్నాయి. మార్కాపురం మండలంలోని పెద్దయాచవరం పంచాయతీ గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి ఒకరు శుక్రవారం మొద్దులపల్లిలో పింఛన్లు పంపిణీ చేసేందుకు గ్రామ టీడీపీ నాయకుడిని వెంటపెట్టుకుని వెళ్లారు. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన పింఛను డబ్బులను కూడా ఆ టీడీపీ నాయకునికి ఇచ్చి సదరు ఉద్యోగి బయోమెట్రిక్ వేసి పింఛన్లు పంపిణీ చేయడం చర్చనీయాంశమైంది. ఈ ఫొటో సోషల్‌మీడియాలో వైరల్ అయింది. ఈ విషయమై మార్కాపురం ఎంపీడీఓ శ్రీనివాసులును వివరణ కోరగా అతను పంచాయతీ వర్కర్ అని తెలిపారు.

సాగర్ కాలువను పరిశీలించిన ఇరిగేషన్ సీఈ
కురిచేడు: జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (అడ్మిన్), కమ్ చీఫ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) బి.శ్యాం ప్రసాద్ నాగార్జునసాగర్ కుడికాలువను శుక్రవారం పరిశీలించారు. కురిచేడు 126 వ మైలు వద్ద నుంచి 202.796 కి.మీ.వద్ద, దొనకొండ మండలం చందవరం 185.611 కి.మీ వద్ద కూలిపోయిన బ్రిడ్జిని పరిశీలించారు. సాగర్ కాలువకు తాగు, సాగు నీరు విడుదల చేశారు. జిల్లా సరిహద్దు 85వ మైలు వద్ద 2550 క్యూసెక్కుల నీరు కుడికాలువకు వస్తోంది. 126వ మైలులో 1790 క్యూసెక్కుల నీరు దర్శి బ్రాంచి కాలువకు చేరుతోంది. ఒంగోలు బ్రాంచి కాలువకు నీరు శుక్రవారం రాత్రికి చేరుతుందని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో కురిచేడు ఎన్ఎస్పీ డీఈఈ అక్బర్ బాషా, కురిచేడు ఎన్ఎస్పీ ఏఈఈలు కె.సాంబశివరావు, బీ రవీందర్ రెడ్డి, కురిచేడు 32వ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ఉన్నగిరి కోటేశ్వరరావు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

సాగును చిదిమేసి.. రైతుకు ఉరివేసి!

అన్నదాతను కూటమి ప్రభుత్వం నిలువునా ముంచేసింది. వర్షాలు లేక జిల్లాలో కరువు కరాళ నృత్యం చేస్తోంది. భూమినే నమ్ముకున్న రైతులకు కష్టాలు తప్పడం లేదు. విత్తు వేయాలంటే భయపడిపోయే పరిస్థితులున్నాయి. పొగాకు, మిర్చి, పత్తి, శనగ, మామిడి, నిమ్మ, వరి.. ఏ పంటలకూ గిట్టుబాటు ధర లభించక ఆర్థికంగా రైతు కుదేలైపోయాడు. కూటమి ప్రభుత్వం సాగునీటి రంగాన్ని గాలికొదిలేయడం, ఏడాది కాలంగా రైతుకు ఇవ్వాల్సిన ఆర్థిక సాయాన్ని ఎగ్గొట్టడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. పెరిగిపోతున్న అప్పులను చూసి భయాందోళనతో బలవన్మరణానికి పాల్పడుతున్నాడు. ఏడాది కాలంగా జిల్లాలో ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కనీసం ఆ కుటుంబాలకు చిల్లిగవ్వ కూడా విదల్చకపోగా, ఏవేవో కుంటిసాకులు చెబుతూ రైతు ఆత్మహత్యలను తప్పుదోవ పట్టించడం మరింత దారుణమని రైతు సంఘాల నాయకులు మండిపడుతున్నారు. అన్ని రకాలుగా సంక్షోభంలో కూరుకుపోయిన రైతుకు అరకొరగా డబ్బులిచ్చేందుకు ముఖ్యమంత్రి ఆర్భాటం చేస్తున్నాడని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతన్న
- జిల్లాలో 17 మండలాల్లో తీవ్ర కరువు
- పట్టెడు అన్నం పెట్టే రైతన్నను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- మిర్చి, పొగాకు, శనగ, పత్తి, వరి, కంది పంటలకు మద్దతు ధర రాక విలవిల
- ఆర్థికంగా కుదేలైన రైతు కుటుంబాలు
- ఏడాదిలోనే ఏడుగురు రైతులు ఆత్మహత్య
- జిల్లాలో జరగాల్సిన నష్టం జరిగిపోయిన తర్వాత ఆర్భాటం
- తొలి ఏడాది సాయం ఎగ్గొట్టి.. నేడు కోతలు పెట్టి
- నేడు అరకొర డబ్బులు ఇచ్చేందుకు దర్శి వస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలో 2024-25 రబీ సీజన్‌లో సాధారణంగా 3,97,880 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేయాల్సి ఉంది. అయితే, కేవలం 2,99,331 ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. వేసిన పంటల్లో కూడా దాదాపు లక్షకుపైగా ఎకరాల్లో నిలువునా ఎండిపోయాయి. మిగతా 1.99 లక్షల ఎకరాల్లో కూడా సగానికిపైగా ఎకరాల్లో దిగుబడి మరీ దారుణంగా పడిపోయింది. దాదాపు జిల్లాలో సుమారుగా 4 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేయాల్సి ఉండగా, చివరకు దిగుబడి అంతంతమాత్రంగానే వచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు జిల్లాలో ఏడుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఒక్కసారిగా చుట్టిముట్టిన ఆర్థిక సమస్యలతో కాలం వెళ్లదీయలేక ఇక లాభం లేదని నిస్సహాయతతో తనువు చాలిస్తున్నారు. సకాలంలో వర్షాలు పడక, ఒకవేళ అదును దాటి పంటలు సాగు చేస్తే పంట సక్రమంగా చేతికిరాక విలవిల్లాడిపోతున్నారు. దానికితోడు ప్రభుత్వం అందిస్తానన్న సాయం అందించకపోవటంతో ఆశగా ఎదురు చూసి చేసిన అప్పులు తీర్చలేక అశువులుబాస్తున్నారు. జిల్లాలో రైతులకు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆర్థికంగా కోలుకోలేని స్థితికి చేరుకున్నారు. రైతు అప్పులు చేసి అవి తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటుంటే దానికి కూడా ఏవో కొన్ని సాకులు చూపించి రైతు కుటుంబానికి వచ్చే సాయం కూడా రాకుండా పంగనామం పెడుతున్నారు. ఆదరించాల్సిన ఇంటి పెద్ద లేకపోవటంతో ఆ కుటుంబాల పరిస్థితి వర్ణనాతీతంగా మారుతోంది.

మిర్చి రైతు కంట్లో కారం..


జిల్లాలోని పశ్చిమ ప్రకాశంలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి తదితర నియోజకవర్గాల్లోని గ్రామాల్లో రైతులు అత్యధికంగా మిర్చి సాగు చేస్తారు. వైఎస్సార్ సీపీ హయాంలో 96 వేల ఎకరాల్లో సాగు చేసిన రైతులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగు విస్తీర్ణాన్ని భారీగా తగ్గించేశారు. ఈసారి సుమారు 59,005 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. గతేడాది నవంబర్‌లో క్వింటా ధర రూ.17 వేల నుంచి రూ.18 వేలు ఉండగా, డిసెంబరు నాటికి రూ.14 వేలకు పడిపోయింది. జనవరిలో రూ.14 వేల నుంచి రూ.12 వేలకు చేరి మార్చిలో రూ.10 వేలు కనిష్టానికి పడిపోయింది. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు మిర్చియార్డుకు వెళ్లడంతో ప్రభుత్వం కొనుగోళ్లపై దృష్టి సారించింది. 2021-22, 2022-23 సంవత్సరాల్లో క్వింటా మిర్చి ధర రూ.25 వేల నుంచి రూ.32 వేల మధ్య పలికింది. అలాంటిది ఈ ఏడాది రూ.11 వేలకు పడిపోవడం గమనార్హం. రైతులు రూ.లక్షల్లో నష్టపోయారు. రైతు కుటుంబాలు కోలుకోలేని అప్పుల ఊబిలోకి నెట్టబడ్డాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం 4,62,944 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాల్సి ఉంది. అలాంటిది ఇప్పటి వరకు కేవలం 25,725 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. అంటే సాధారణ విస్తీర్ణంలో కేవలం నాలుగు శాతం మాత్రమే సాగులోకి వచ్చిందంటే జిల్లాలో రైతన్న పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

అన్నదాత సుఖీభవ కుదింపే లక్ష్యంగా...

ఏడాది పాలన తరువాత చంద్రబాబుకు ఎన్నికల హామీ గుర్తుకొచ్చింది. ఈ ఏడాదిలో ఎంతో మంది రైతుల ఉసురుపోసుకున్నారు. ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబాలు కుమిలిపోతున్నాయి. అయినా అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ ఇస్తున్నాడా అంటే అదీ లేదు. సవాలక్ష ఆంక్షలు పెట్టి జల్లెడపట్టారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం గాలికి వదిలేసి ఎగ్గొట్టారు. చివరకు 2,68,165 మంది రైతులను అర్హులుగా తేల్చారు. పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా ఏడాదికి రూ.20 వేలు ఇస్తానన్న ఆయన.. తాజాగా పీఎం కిసాన్‌తో కలిపి ఇస్తానని మాట మార్చారు. తొలి విడత రూ.7 వేలు ఇస్తానని చెప్పి, గత నెలలో వచ్చిన పీఎం కిసాన్‌తో కలిపి రూ.7 వేలు అని మాట మార్చారు. అయితే, మొదటి విడతలో చంద్రబాబు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుంది కేవలం రూ.5 వేలు మాత్రమే. జిల్లాలో రూ.134.08 కోట్లు ఇస్తున్నానని చెబుతున్నారు. అందులో భాగంగా శనివారం సీఎం చంద్రబాబు దర్శికి రానున్నారు. అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2022-23 సంవత్సరంలో రైతు భరోసా కింద 2,86,256 మందికి ఏడాదికి రూ.13,500 చొప్పున వైఎస్ జగన్ అందజేశారు. రైతు భరోసా రూపంలో అందించింది ఐదేళ్లలో అక్షరాలా రూ.1,634.85 కోట్లు.



యలమందయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)



ఆర్ వెంకట చిన్న చెన్నయ్య



కలువా బాలకోటిరెడ్డి



రాచరకొండ శ్రీను



చల్ల మధుసూదన్‌రెడ్డి



వెంకటేశ్వర్లు (ఫైల్)



చిన్న దిబ్బారెడ్డి (ఫైల్)

చంద్రబాబు వస్తున్నాడని ధాన్యం డబ్బులు వేశారు...

చంద్రబాబు జిల్లా పర్యటన ఖరారు కావడంతో హడావుడిగా రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు వేశారు. పది రోజుల కిందటి వరకూ జిల్లాలోని రైతాంగానికి దాదాపు రూ.3 కోట్లు ధాన్యం కొనుగోలు చేసిన డబ్బులు బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఇంకా రూ.50 లక్షల వరకూ చెల్లించాల్సి ఉంది. మరి అవి ఎప్పుడు రైతులకు చేరుతాయో ? ధాన్యం కొనుగోళ్లు పూర్తి స్థాయిలో చేయకపోవడంతో దళారులు చెప్పిన రేటుకు తెగనమ్ముకున్నారు. జిల్లాలో 50 వేల టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉంటే కేవలం 9,800 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసి నిలువునా దగా చేశారు.

శనగలు, మినుములు కొనుగోలే చేయలేదు...

జిల్లాలో పండించిన శనగలు, మినుములను ప్రభుత్వం కొనుగోలే చేయలేదు. దాంతో పండించిన రైతుల దళారుల చేతుల్లో పడి నలిగిపోయి చివరకు అప్పుల పాలయ్యారు. ప్రభుత్వం కేవలం కందులు మాత్రమే కొనుగోలు చేసింది. జిల్లాలో 80 వేల మెట్రిక్ టన్నుల కందులు పండితే కేవలం 25,887 టన్నులు మాత్రమే తూతూమంత్రంగా కొనుగోలు చేశారు. బయట మార్కెట్‌లో కందుల క్వింటా ధర కేవలం రూ.6 వేల నుంచి రూ.6500 మాత్రమే ఉంది. ప్రభుత్వం కొనుగోలు చేసుంటే రైతులు బాగుపడేవారు.

అడుగంటిన భూగర్భ జలాలు, ఒట్టిపోయిన 93 గ్రామాలు...

ఓవైపు వెంటాడుతున్న వర్షాభావ పరిస్థితులు.. మరోవైపు సుర్రుమని మండుతున్న ఎండలు జిల్లాలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి పడిపోవటానికి కారణాలుగా మారాయి. కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అధ్యయనంలో ఈ భయంకరమైన వాస్తవాలు వెలుగు చూశాయి. 12 మండలాల పరిధిలోని 93 గ్రామాలు నీళ్లు లేక అలమటిస్తున్నాయి.

17 మండలాల్లో కరువు...

జిల్లాలో రబీ సీజన్‌లో పంటల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. 38 మండలాల్లోని 17 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది ప్రభుత్వం. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన ఒంగోలు రూరల్ మండలం కూడా కరువు కోరల్లో చిక్కిశల్యమవుతోంది. తీవ్ర కరువు మండలాల్లో ఒంగోలుతో పాటు పుల్లలచెరువు, దొనకొండ, కురిచేడు, మద్దిపాడు, కంభం, తర్లుపాడు, పెద్దారవీడు, సంతనూతలపాడు, వెలిగండ్ల, బేస్తవారిపేట ఉన్నాయి. సాధారణ కరువు మండలాల జాబితాలో కొనకనమిట్ల, మార్కాపురం, చీమకుర్తి, సీఎస్‌పురం, పామూరు, రాచర్ల మండలాలు ఉన్నాయి.

నల్ల బర్లీపై నయవంచన...

నల్ల బర్లీ పొగాకు సాగు చేసిన రైతులను చంద్రబాబు ప్రభుత్వం నయవంచన చేసింది. రైతుల వద్ద ఉన్న చివరి పొగాకు వరకూ కొనుగోలు చేస్తానని నమ్మించిన చంద్రబాబు.. చివరకు ఆంక్షలు పెట్టి మరీ రైతులను మోసం చేశాడు. క్వింటా రూ.12 వేల చొప్పున కొనుగోలు చేస్తానని నమ్మించి అరచేతిలో వైకుంఠం చూపించారు. కొనుగోలు దగ్గరకు వచ్చేసరికి సవాలక్ష ఆంక్షలు పెట్టారు. చివరకు ఒక్కో రైతు నుంచి కేవలం 20 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తామని మోసం చేస్తున్నారు. జిల్లాలో 6,325 టన్నుల బ్లాక్ బర్లీ పొగాకు ఉత్పత్తి అయింది. అందులో ఇప్పటి వరకు కేవలం 809 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా రైతుల వద్ద మరో 5,426 మెట్రిక్ టన్నుల బ్లాక్ బర్లీ పొగాకు నిల్వలు మగ్గుతున్నాయి. వ్యాపారులు కూటమి కట్టి వర్జీనియా పొగాకును సక్రమంగా కొనుగోలు చేయటం లేదు. అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్జీనియా పొగాకును రూ.200 కోట్లు వెచ్చించి మార్క్‌ఫెడ్ ద్వారానే కొనుగోలు చేయించి ఆదుకున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తనువు చాలించిన రైతులు

✔ మార్కాపురానికి చెందిన రాజారపు పెద్ద యలమందయ్య అనే రైతు 7 ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నాడు. ఏటా మిర్చి, పత్తి తదితర పంటలు సాగు చేస్తున్నాడు. రైతు భరోసా అందకపోవడంతో పంటల సాగు కోసం వడ్డీలకు అప్పులు తీసుకున్నాడు. అప్పుల వారి ఒత్తిడి, దిగుబడులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో జూన్ 7వ తేదీ పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

✔ తర్లుపాడు మండలం పోతలపాడుకు చెందిన రాచకొండ శ్రీను గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లో 5 ఎకరాల్లో కంది, మిర్చి, పొగాకు పంటలు సాగుచేశాడు. దిగుబడులు ఆశించినమేర రాకపోవడం, పెట్టుబడి వ్యయం ఎక్కువకావడంతో అప్పులు తీర్చలేనన్న బాధతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లోనే పురుగుల మందు తాగి మార్చి 21న ఆత్మహత్య చేసుకున్నాడు.

✔ తాళ్లూరు మండలం చింతలపాలేనికి చెందిన కలువా బాలకోటిరెడ్డి గత రబీ సీజన్లో రెండు ఎకరాల్లో మిర్చి, ఎకరంలో టమోట, ఎకరంలో వరి నాటాడు. మిర్చి, టమోట పంట కోసం భారీగా అప్పులు చేశాడు. అకాల వర్షంతో టమోట పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. మిరప ధరలు కూడా పడిపోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 3న పొలానికి వెళ్లి మిరపకు కొట్టేందుకు తెచ్చుకున్న పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లి చికిత్స పొందుతూ మూడు రోజుల అనంతరం మృతి చెందాడు.

✔ పెద్దారవీడు పంచాయతీలో సిద్ధిరాయునిపల్లి గ్రామానికి చెందిన రుద్రపాటి చిన్న వెంకట చెన్నయ్య (70) గత ఏడాది రెండు ఎకరాల్లో మిర్చి, ఎకరన్నరలో టమోటా, రెండున్నర ఎకరాల్లో పొగాకు పంటలు సాగుచేశాడు. సాగుచేసిన పంటకు చీడపీడలు, తెగుళ్లు రావడం.. సకాలంలో వర్షాలు కురవక దిగుబడులు తగ్గడంతో పాటు పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం తెలియక గత ఏడాది అక్టోబర్ 8వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు.

✔ అర్ధవీడు మండలంలోని చిములేటిపల్లెకు చెందిన రైతు నడిపి వెంకటేశ్వర్లు (43) తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని గత ఏడాది పత్తి, మొక్కజొన్న, మిరప పంటలు సాగుచేశాడు. పంటలు సరిగా పండకపోవడంతో పాటు సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం తెలియక గత ఏడాది అక్టోబర్ 31న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయాడు

✔ అర్ధవీడు మండలం కాకర్లకు చెందిన చిన్న దిబ్బారెడ్డి (42) గత ఏడాది బోర్ల కింద 2 ఎకరాల్లో పొగాకు నారుమండి, 5 ఎకరాల్లో మిర్చి సాగుచేశాడు. తీవ్ర వర్షాభావంతో పంటలు పూర్తిగా ఎండిపోయి కుంగిపోయాడు. 2024 అక్టోబర్ 28వ తేదీ సాయంత్రం పొలానికి వెళ్లి పురుగులమందు తాగి మృతిచెందాడు.

✔ కొండపి మండలం నెన్నూరుపాడుకు చెందిన చల్ల మధుసూదన్‌రెడ్డి తన తండ్రితో కలిసి 10 ఎకరాల్లో పొగాకు సాగు చేశాడు. మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకుని పొగాకు పండించారు. గత ఏడాది పొగాకుకు మంచి ధర లభించడంతో ఈ ఏడాది రూ.20 లక్షల వరకు అప్పులు చేసి పొగాకు సాగు చేశాడు. వేలంలో గిట్టుబాటు ధర దక్కకపోవడంతో జూన్ 6వ తేదీన కొండపిలోని పొగాకు బోర్డు వెనక ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఫీడర్ కెనాల్ పనుల పరిశీలన

పెద్దదోర్నాల:

మండల పరిధిలోని గంటవానిపల్లె వద్ద జరుగుతున్న ఫీడర్ కెనాల్ అండర్ టన్నెల్ పనులను ఇరిగేషన్ ఇన్‌చార్జి ఎస్ఈ అబూతాలిమ్ శుక్రవారం పరిశీలించారు. గంటవానిపల్లె వద్ద జరుగుతున్న అండర్ టన్నెల్ ఎస్కేప్ రెగ్యులేటర్ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు క్యాంపు కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. వెలుగొండ ప్రాజెక్టు రెండవ సొరంగం తవ్వకం పనులు మరో కిలోమీటరు మేర జరగాల్సి ఉందని, దీంతో పాటు లైనింగ్ పనులు మరో 5.2 కిలోమీటర్ల మేర జరగాల్సి ఉన్నాయని అధికారులు ఎస్ఈ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పనులు పూర్తి స్థాయిలో నిర్వహించేలా చూడాలని, దీంతో పాటు ఎస్కేప్ రెగ్యులేటర్ అండర్ టన్నెల్ పనులు వేగంగా జరిగేలా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. ఎస్ఈ వెంట క్వాలిటీ కంట్రోల్ ఈఈ రాజగోపాల్, డీఈ. విద్యాసాగర్, ఏఈ అశోక్, ఇరిగేషన్ డీఈ చర్యణ్, ఏఈ అంజలి, మెగా కన్‌స్ట్రక్షన్స్ డీఎం శ్రీనాథ్, ప్లానింగ్ ఇంజినీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్కేప్ రెగ్యులేటర్ పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ అబూతాలిం

‘నేను మారాను.. మీకంతా మంచే చేస్తాను. దొనకొండలో పరిశ్రమలు స్థాపిస్తా.. నిరుద్యోగులకు ఉద్యోగాలొచ్చే వరకు భృతి అందజేస్తా.. ఎంఎస్‌ఎంఈ ప్రాజెక్టును పునరుద్ధరిస్తా.. హైవే బ్రిడ్జిలు నిర్మిస్తా.. సాగర్ ఆయకట్టులో మూడు పంటలు పండించుకునేలా సాగునీరు సరఫరా చేస్తా.. తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ఇంటింటికీ తాగునీరు అందిస్తా..’ ఇవీ గత ఏడాది సార్వత్రిక ఎన్నికల వేళ దర్శి నియోజకవర్గ ప్రజలకు ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు ఇచ్చిన హామీలు. ఇవి కాకుండా కూటమి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్‌తోపాటు మొత్తం 140కి పైగా హామీలు గుప్పించి ఇంటింటికీ కరపత్రాలు పంపిన చంద్రబాబు.. తీరా గద్దెనెక్కిన తర్వాత అమలు సంగతి మరిచారు. హామీలు అమలు చేస్తారని చంద్రబాబును నమ్మిన ప్రజలకు చివరకు మిగిలింది నైరాశ్యమే. అధికారం చేపట్టిన తర్వాత సీఎం హోదాలో తొలిసారి దర్శి పర్యటనకు వస్తున్న చంద్రబాబునాయుడు హామీలపై పెదవి విప్పుతారో.. ఎప్పటిలాగే నాలుక మడతేస్తారోనని నియోజకవర్గ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నమ్మినోళ్లకు నైరాశ్యమే!



ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చని చంద్రబాబు

- గద్దెనెక్కిన 14 నెలల తర్వాత తొలిసారి దర్శి మండలంలో పర్యటన
- బాబు హామీలను గుర్తు చేసుకుంటున్న నియోజకవర్గ ప్రజలు
- గత ఏడాది ఆయకట్టుకు సాగు నీరందక ఎండిన పంటలు
- నష్ట పరిహారం కింద అన్నదాతలకు పైసా విదల్చని సర్కారు
- దొనకొండకు రాని పరిశ్రమలు.. నిరుద్యోగుల ఉసూరు

దర్శి: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా 2024 మే 4వ తేదీన దర్శి పర్యటనకు వచ్చిన చంద్రబాబు ఇబ్బడిముబ్బడిగా హామీలు గుప్పించారు. కానీ వాటిలో ఒక్కటంటే ఒక్క హామీని కూడా అమలు చేసిన దాఖలాలు లేవు. దొనకొండలో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తామని, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, తద్వారా నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని నమ్మబలికిన చంద్రబాబు ఇక్కడ ఒక్క పరిశ్రమనూ నెల కొల్పే దిశగా చర్యలు తీసుకోలేదు. పైగా నిరుద్యోగులకు రూ.3 వేల చొప్పున ఇస్తామన్న భృతినీ తొలి ఏడాదే ఎగ్గొట్టారు. 2014–19 మధ్య ఐదేళ్ల పాటు పాడిన పాటనే చంద్రబాబు గత ఏడాది సార్వత్రిక ఎన్నికల మరలా పాడారు. కానీ అభివృద్ధికి అన్ని వనరులు ఉన్న దొనకొండను మాత్రం పట్టించుకోలేదు.


డ్రైవింగ్ స్కూల్ ప్రాంగణం


పనులు ఆగిపోయిన మొగిలిగుండాల రిజర్వాయర్

రైతులకు దగా

గోదావరి–కృష్ణా నదులను అనుసంధానం చేసి సాగర్ కాలువల ద్వారా మూడు పంటలకు నీరు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఆయకట్టు పరిధిలో కనీసం ఒక పంటకు కూడా గతేడాది నీరు అందించలేదు. శనివారం చంద్రబాబు పర్యటిస్తున్న తూర్పు వీరాయపాలెం గ్రామంలోని పొలాలకు సైతం పూర్తి స్థాయిలో ఒక పంటకు కూడా నీరివ్వలేదు. గతేడాది సాగర్ ఆయకట్టు పరిధిలోని ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో నీరు అందక మొక్కజొన్న పంట ఎండిపోయింది. అలాగే అకాల వర్షాల కారణంగా వరి, సజ్జ, గుమ్మడి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ఆయా పంటలను మంత్రులు, కలెక్టర్ పరిశీలించి వెళ్లారే కానీ పంట నష్టపోయిన రైతులకు పైసా విదిల్చిన పాపాన పోలేదు.

పరిశ్రమలు హుళక్కేనా?

రాగముక్కపల్లిలో రూ.7 కోట్ల నిధులతో ఎంఎస్‌ఎంఈ ప్రాజెక్ట్ పునఃప్రారంభిస్తామని, చందవరం వద్ద రూ.6 కోట్లతో ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తామన్న హామీలు నెరవేర్చే దిశగా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. కేంద్రంలో కూటమి పార్టీనే అధికారంలో ఉన్నప్పటికీ గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులే కానీ ఈ ఏడాది కిలోమీటర్ ట్రాక్ కూడా నిర్మించలేదు. దర్శి నుంచి శ్రీకాళహస్తి వరకు పనులన్నీ ఆగిపోయాయి. పెద్ద ఉయ్యాలవాడలో ముసి నదిపై వంతెన, దోర్నపు వాగుపై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం సంగతినే మరిచారు.



దొనకొండలో చిల్లచెట్లతో నిండిన ఎంఎస్‌ఎంఈ ప్రాజెక్ట్


ఇండస్ట్రియల్ కారిడార్‌కు కేటాయించిన ప్రభుత్వ భూముల్లో చిల్లచెట్లు

తాగునీటికీ దిక్కులేదు

దర్శి నియోజకవర్గంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తామన్న హామీ నీటి మూటగా మారింది. ప్రస్తుతం ఎన్‌ఎపీ రిజర్వాయర్ నుంచి తాగునీరు శుద్ధి చేయకుండా నేరుగా పైప్‌లైన్ల ద్వారా వదులుతున్నారు. అవి తాగిన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆ నీటిని కూడా వారం, పది రోజులకు ఒకసారి వదులడం గమనార్హం. కొన్ని గ్రామాలకు 15 రోజులకు కూడా నీరు సరఫరా కావడం లేదు. గత ప్రభుత్వంలో అమృత్ 2.0 పథకంలో భాగంగా దర్శి నగర పంచాయతీకి రూ.121 కోట్లతో నూతన పైప్‌లైన్లు, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు మంజూరు చేశారు. ఆ పనులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించారు. అయితే కూటమి అధికారంలోకి రాగానే అమృత్ పనులను నిలిపివేశారు. గుండ్లకమ్మ ఎగువ నీటిని తాళ్లూరు మండలం మల్కాపురం వద్ద లిఫ్ట్ చేసుకుని ముండ్లమూరు, తాళ్లూరు మండలాలకు తాగునీరు ఇస్తామన్న హామీని ఇంత వరకు పట్టించుకోలేదు. తాళ్లూరు మండలంలోని మొగిలిగుండాల రిజర్వాయర్ పనులు పరుగులు పెట్టిస్తానని ప్రజలకు ఇచ్చిన హామీని సైతం గాలికొదిలేశారు.

అక్రమాలపై ఆరాతీస్తారా?

దర్శి నియోజకవర్గంలో అభివృద్ధిని గాలికొదిలేసి కూటమి నేతలు యథేచ్ఛగా దందాలు చేస్తున్నారు. ముండ్లమూరు మండలం చిలకలేరులో ఇసుకను జేసీబీలతో తవ్వి టన్ను రూ.1230కు తెగనమ్మారు. టర్బో లారీల్లో ఇతర ప్రాంతాలకు సైతం ఇసుక తరలించి సొమ్ము చేసుకున్నారు. భవన నిర్మాణదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని దర్శి గడియారం స్తంభం సెంటర్ సాక్షిగా హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఇక్కడ జరుగుతున్న ఇసుక దందాపై స్పందిస్తారా అనేది ప్రశ్నార్థకమే. గ్రామాలు, పట్టణాల్లో విచ్చలవిడిగా వెలసిన బెల్టు షాపులు, సమయ పాలన లేకుండా బార్ అండ్ రెస్టారెంట్లలో మద్యం విక్రయాలు, అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలపై చంద్రబాబు ఆరా తీస్తారా లేదా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులు ప్రారంభమైన ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పనులను పరుగెత్తిస్తామని, అభివృద్ధికి తొలి అడుగు అక్కడ నుంచేనని టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి ఇచ్చిన హామీకి ఇంత వరకు అతీగతి లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే అధికారులను పిలిపించి డ్రైవింగ్ స్కూల్ పనులపై చర్చించడం మినహా గడిచిన 13 నెలలుగా అటువైపు కన్నెత్తి చూడలేదు. గత ప్రభుత్వంలో చేపట్టిన నిర్మాణాలు, భవనాలకు వేసిన పిల్లర్లు అలాగే దర్శనమిస్తున్నాయి.

క్లుప్తంగా

పట్టపగలు దొంగల హల్‌చల్


- సుమారు 10 సవర్ల బంగారం చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

సింగరాయకొండ: పట్టపగలే ఓ ఇంటి తాళం పగల కొట్టి చోరీకి పాల్పడి పోలీసులకు దొంగలు సవాల్ విసిరారు. సుమారు 10 సవర్ల బంగారం అపహరించారు. ఈ ఘటన సింగరాయకొండ మండల కేంద్రంలోని చేపల మార్కెట్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ నగర్–4వ లైన్‌లో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఇంటి యజమాని బండి కృష్ణవేణి గుడ్లూరు మండలం పెదపవనిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో లెక్చరర్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త వెంకటేశ్వర్లు ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు. శుక్రవారం ఉదయం భార్యభర్తలిద్దరూ కలిసి గురుకుల పాఠశాలకు కారులో వెళ్లారు. అయితే, మధ్యాహ్నం 2 గంటల సమయంలో కూడా తాళం వేసి ఉండటాన్ని ఆ ఇంటి పైపోర్షన్‌లో అద్దెకు ఉండేవారు చూశారు. కానీ, సాయంత్రం 4.30 గంటలకు తాళం పగలకొట్టి ఉండటాన్ని గమనించి వెంటనే చోరీ జరిగిన సమాచారాన్ని కృష్ణవేణికి తెలిపారు. వారు ఇంటికొచ్చి చూడగా బీరువాలోని దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. సుమారు 10 సవర్ల బంగారం చోరీ అయిందని గుర్తించారు. ఇంకా ఎంత మొత్తం చోరీ జరిగిందనేదానిపై ఫిర్యాదు ఇవ్వలేదని పోలీసులు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో సంఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసులు ఆధారాలు సేకరించారు.


బిర్యానీ రేటు దగ్గర గొడవ

- రెచ్చిపోయిన మందుబాబులు


గొడవపడుతున్న మందుబాబులు

ఒంగోలు టౌన్: నగరంలో మందుబాబులు రెచ్చిపోతున్నారు. పీకలదాకా తాగి గొడవలకు దిగుతున్నారు. ఇటీవల త్రోవగుంట రోడ్డులోని ఒక రెస్టారెంటులో మద్యం బాబులు గొడవకు దిగగా.. శుక్రవారం సౌత్ బైపాస్‌లో రెచ్చిపోయారు. నగరంలోని ప్రగతి నగర్‌కు చెందిన కొందరు యువకులు సౌత్ బైపాస్‌లో రోడ్డు పక్కన బీఫ్ బిర్యానీ పాయింట్ దగ్గరకు వచ్చారు. బిర్యానీ తిన్న తరువాత రేటు విషయంలో నిర్వాహకురాలు మరియమ్మతో గొడవ పెట్టుకున్నారు. ఈ తతంగాన్ని గమనిస్తున్న అక్కడున్న వెల్డింగ్ షాపు నిర్వాహకుడు తంగిరాల ఏసురత్నం కల్పించుకున్నాడు. మహిళతో దురుసుగా ప్రవర్తించడం సరికాదని హితవు పలికాడు. దాంతో మద్యం మత్తులో వున్న యువకులు రెచ్చిపోయారు. మాకే నీతులు చెబుతావా అంటూ గొడవకు దిగారు. స్నేహితులతో వచ్చి ఏసురత్నం మీద దాడి చేశారు. గాయపడిన ఏసురత్నాన్ని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ గొడవకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ట్రోల్ అవుతోంది.

కృష్ణమ్మ పరవళ్లతో పారవశ్యం..!


శ్రీశైలం డ్యాం గేట్లు ఎత్తడంతో కిందకు జాలువారుతున్న కృష్ణా జలాలు


పెద్దదోర్నాల గణపతి ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద శ్రీశైలం వెళ్లే వాహనాలతో రద్దీ

- శ్రీశైలం డ్యాంకు పెరిగిన సందర్శకులు
- పెద్దదోర్నాల గణపతి ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద అధిక సంఖ్యలో వాహనాలు

పెద్దదోర్నాల: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా నదికి వరద నీరు పోటెత్తుతోంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టులో 8 గేట్లను ఎత్తి దిగువనున్న నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం డ్యాంను సందర్శించేందుకు, శ్రీశైలం మల్లన్నను దర్శించుకునేందుకు పర్యాటకులు, భక్తులు భారీగా శ్రీశైలం తరలివెళ్తున్నారు. దీంతో పాటు శ్రావణ శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో వాహనాలలో భక్తులు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి తరలివెళ్లారు. శుక్రవారం పెద్దదోర్నాల మండల పరిధిలోని నల్లమల ఘాట్ రోడ్డలో వాహనాల రద్దీ మరింత పెరిగింది. ఒకవైపు మల్లన్న కొలువుదీరిన శ్రీశైలం పుణ్యక్షేత్రం భక్తులకు కొంగుబంగారంగా వెలుగొందుతుండగా.. మరోవైపు భ్రమరాంభా మల్లికార్జునుల పాదపద్మాలను స్పృశిస్తూ ప్రవహించే కృష్ణా నదిపై నల్లమల అభయారణ్యంలో నిర్మించిన బహుళార్థక నీలం సంజీవరెడ్డి శ్రీశైలం హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదలడం మరింత శోభను చేకూరుస్తోంది. వీటన్నింటికీ నల్లమల అందాలు తోడయ్యాయి. ఇటీవల డ్యాం ఎగువ భాగంలో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం డ్యాంకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. డ్యాంకు వరద ప్రవాహం అధికంగా ఉండటంతో నాలుగు రోజులుగా డ్యాం గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో డ్యాం వద్ద నీరు దిగువకు జాలువారుతున్న సుందర దృశ్యాలను చూసేందుకు సందర్శకులు భారీగా శ్రీశైలం డ్యాంసైట్‌కు తరలివెళ్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్దదోర్నాల మండల పరిధిలోని నల్లమల ఘాట్ రోడ్డులో, గణపతి ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద వాహనాలతో రద్దీ వాతావరణం నెలకొంది. దీంతో పాటు కొద్దిరోజులుగా నల్లమల అటవీప్రాంతంలో వర్షాలు కురుస్తుండటంతో చెట్లన్నీ చిగురించి పచ్చదనంతో పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. ఈ దృశ్యాలన్నీ చూసేందుకు పలు ప్రాంతాలకు చెందిన సందర్శకులు ప్రత్యేక వాహనాలలో శ్రీశైలం తరలివెళ్తుండటంతో రద్దీ ఏర్పడింది.


సీఎం పర్యటనకు పటిష్ట భద్రత


- ఎస్పీ ఏఆర్ దామోదర్


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

దర్శి: అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబునాయుడు శనివారం దర్శి మండలంలోని తూర్పువీరాయపాలెం గ్రామానికి వస్తున్న సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. సీఎం సభ ఏర్పాట్లను జిల్లా అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. హెలీప్యాడ్, వీఐపీ వాహనాల రూట్, పార్కింగ్ ఏరియా వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ.. సీఎం పర్యటనను డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఎస్పీ వెంట దర్శి, ఒంగోలు, మార్కాపురం డీఎస్పీలు లక్ష్మీనారాయణ, ఆర్.శ్రీనివాసరావు, యు.నాగరాజు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, దర్శి, త్రిపురాంతకం సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

రోడ్డెక్కిన అద్దె బస్సుల డ్రైవర్లు


నిరసన తెలుపుతున్న ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు


కనిగిరి డిపోలో నిలిచిపోయిన అద్దె బస్సులు

- ఆన్ కాల్ డ్రైవర్లుగా అవకాశం ఇవ్వాలంటూ ధర్నా
- కనిగిరి డిపోలో నిలిచిపోయిన బస్సులు

కనిగిరి రూరల్: ఆన్ కాల్ డ్రైవర్లుగా బస్సులు నడిపేందుకు తమకు అవకాశం ఇవ్వకుండా కొత్త వారిని ఆహ్వానిస్తూ అద్దె బస్సుల యజమానుల మాట విని తమ దరఖాస్తులను తిరస్కరించడాన్ని నిరసిస్తూ కనిగిరిలో శుక్రవారం అద్దె బస్సుల డ్రైవర్లు రోడ్డెక్కి నిరసన తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో సుమారు 24 అద్దె బస్సులు తిరుగుతున్నాయి. ఆ బస్సుల్లో డ్రైవర్లుగా సుమారు 65 మంది పనిచేస్తున్నారు. వీరంతా దాదాపు 12 నుంచి 15 ఏళ్లుగా డ్రైవర్లుగా విధులు నిర్వర్తిస్తూ అన్ని విధాలుగా అనుభవం కలిగి ఉన్నారు. అయితే, ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) వారు కనిగిరి డిపోలో ఆన్ కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు అవుట్ సైడ్ డ్రైవర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆ దరఖాస్తుల స్వీకరణలో ఇప్పటికే అన్ని అర్హతలు కలిగి అనుభవం ఉన్న అద్దె బస్సుల డ్రైవర్ల దరఖాస్తులను తిరస్కరించారు. దీనిని వ్యతిరేకిస్తూ అద్దె బస్సుల డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైవర్లు విధులు బహిష్కరించి కనిగిరి డిపో ఆవరణలో ధర్నాకు దిగారు.

మాకు అన్యాయం చేయడం తగదు...


తమకు ఎప్పుడో ఒకసారి ఆర్టీసీలో అవకాశం లుగుతుందన్న ఆశతోనే సుమారు 15 ఏళ్లుగా ఆర్టీసీ అద్దె బస్సుల్లో డ్రైవర్లుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నట్లు ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల యూనియన్ నాయకులు ఆంజనేయులు, రాజారావు తెలిపారు. ఆర్టీసీ యాజమాన్యం కనీసం తమ దరఖాస్తులను పరిగణలోకి తీసుకోకుండా అద్దె బస్సుల ఓనర్ల మాటలు విని తమను అన్యాయం చేయడం తగదని అన్నారు. అద్దె బస్సుల ఓనర్ల విన్నపాన్ని పరిగణలోకి తీసుకుని ఏళ్ల నుంచి డ్రైవర్లుగా వెట్టి చాకిరి చేస్తున్న తమకు అవకాశం కల్పించకపోవడం దారుణమన్నారు. ఆన్‌కాల్ డ్రైవర్లుగా అద్దె బస్సుల డ్రైవర్లకు అవకాశం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టీసీ అధికారులు కనీసం తమకు సమాధానం చెప్పడం లేదని వాపోయారు. అంతేగాకుండా ఎంతో ప్రశాంతంగా తాము నిరసన తెలుపుతుంటే పోలీసులతో దౌర్జన్యంగా బయటకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసేంత వరకు పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు భాస్కర్‌రెడ్డి, సుందరయ్య, మహేంద్ర, శ్రీనివాసులు, యలమందారెడ్డి, ఖాజా, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో నియామకాలు

ఒంగోలు టౌన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులను ఆ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాలలో పదవుల్లో నియమించారు. ఆ మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. మార్కాపురంకు చెందిన సింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డిని రాష్ట్ర పబ్లిసిటి విభాగం కార్యదర్శిగా, సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన ఎస్.అనిల్‌కుమార్‌ను రాష్ట్ర సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీగా నియమించారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- క్షయ వ్యాధిగ్రస్తులతో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వాణిశ్రీ


టీబీపై అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ రంగకుమార్

ఒంగోలు టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి నిక్షయ్ పోషణ యోజన కింద క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.1000 బ్యాంకులో జమ చేస్తోందని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వాణిశ్రీ తెలిపారు. దాంతోపాటుగా దాతల సహాయంతో కూడా పోషకాహారాన్ని అందజేస్తున్నట్లు చెప్పారు. వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక కోడేవీధిలోని మస్జిద్‌లో టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపాకాలనీ అర్బన్ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంగకుమార్ యాదవ్ మాట్లాడుతూ రెండు వారాల కంటే ఎక్కువగా జ్వరం రావడం, విడవకుండా దగ్గు వేధించడం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని చెప్పారు. మద్యపానం, ధూమపానం చేసే వ్యక్తులు, మధుమేహంతో బాధపడే వారు, పోషకాహార లోపం కలిగిన వారు ఎక్కువగా క్షయవ్యాధి బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని క్షయవ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీపీఎం కోటేశ్వరరావు, టీబీ సూపర్‌వైజర్ కాలేషా తదితరులు పాల్గొన్నారు.